

ఉపాధ్యాయులపై సస్పెన్షన్లు ఎత్తివేత

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఇటీవల జరిగిన పదవ తరగతి రెగ్యులర్, ఓపెన్ స్కూల్ పరీక్షల్లో మొదటిరోజు విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఎనిమిది మంది ఇన్విజిలేటర్లు (ఉపాధ్యాయులు)పై తీసుకున్న సస్పెన్షన్ చర్యలను ఎత్తివేస్తూ అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీచేశారు. సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ పెండింగ్ ఎంక్వయిరీ కింద పాత స్థానాల్లోనే కొనసాగిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల కాపీలను డిప్యూటీ డిఈవోలు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు మంగళవారం నాడు పంపారు. కాగా ఉపాధ్యాయులపై తీసుకున్న చర్యలకు సంబంధించి దీనిపై విచారణ పూర్తి స్థాయిలో కొనసాగించి తదుపరి చర్యలు తీసుకుంటామని డిఇఒ తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దాం

అనంతపురం రేంజ్ డిఐజి ఆర్‌ఎన్.అమ్మిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి అమ్మిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దామని అనంతపురం రేంజ్ డిఐజి ఆర్‌ఎన్.అమ్మిరెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో అనంతపురం ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి జిల్లాలోని గ్రామ,వార్డు మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ విలేజ్ కానిస్టేబుల్, మహిళా పోలీస్ సమన్వయంతో పని చేయాలన్నారు. ఎస్‌హెచ్‌ఒ, డీఎస్పీలకు గ్రామ విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. గ్రామం, వార్డు స్థాయిలో నేరాలు జరుగకుండా ఎప్పటికప్పుడు సమాచారాన్ని పోలీసు అధికారులకు చేరవేసే బాధ్యత గ్రామ, వార్డు పోలీసు సిబ్బందిపై ఉందన్నారు. ప్రజలతో సత్సంబంధాలను కొనసాగించాలని సూచించారు. మహిళా సమస్యలపై దృష్టి సారించడంతో పాటు అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా వేయాలన్నారు. విధి నిర్వహణలో మంచి పనులు చేసే వారికి ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఎస్‌హెచ్‌ఒలు ప్రతివారం మహిళా పోలీసులతో సమావేశమై గ్రామస్థాయి సమస్యల పరిష్కారానికి కషి చేయాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయిలో సమస్యలను గుర్తించి పోలీసు అధికారుల దష్టికి తీసుకురావాలన్నారు. మహిళా వ్యవస్థ ఏర్పాటయ్యాక గణనీయమైన ఫలితాలు వస్తున్నాయని, వీటిని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేలా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవసరమైన మెళకువలు, సూచనలు, సైబర్ నేరాలకు గురైన సందర్భంలో ఎలా ముందుకెళ్లి పరిష్కారం చేసుకోవచ్చు, చిన్నారులపై జరిగే లైంగిక దాడులు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌ల గురించి వివరిస్తూ లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు, దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, గుంతకల్లు డీఎస్పీ యు.నరసింగప్ప, తాడిపత్రి డీఎస్పీ చైతన్య, టెక్నికల్ ఎస్ఐ సుధాకర్ యాదవ్‌తో పాటు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధిత వస్తువుల అమ్మకాలను పూర్తిగా నిలిపేయాలని కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. అనంతపురం నగరంలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నియంత్రణపై మంగళవారం నాడు కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ రమణారెడ్డి జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యులతో మంగళవారం నాడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తనిఖీలను నిబంధన మేరకు నగరంలో జరపాలన్నారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించి నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు నిల్వ ఉంచుకున్నా, అమ్మకాలు జరుగుతున్నా, సంబంధిత విక్రయదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సింగల్‌యూజ్ ప్లాస్టిక్ వాడకంపై నియంత్రణ పూర్తిగా అమలు చేయాల్సి ఉందన్నారు. ఇదివరకే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు సింగల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీ, దిగుమతి, నిల్వ, పంపిణీ, వాడకం, అమ్మకాలను పూర్తిగా నిషేధించాయన్నారు. ఈ విషయంపై నగరపాలక సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పలుమార్లు వివిధ మార్గాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారని చెప్పారు. ప్లాస్టిక్ వస్తువులు విక్రయించే వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించి నిషేధించిన వస్తువులపై తెలియజేశామన్నారు. ఇటీవల జరిపిన ఆకస్మిక తనిఖీల్లో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేశామన్నారు. భవిష్యత్తులోనూ తనిఖీలు కొనసాగుతాయని చెప్పారు. నిషేధిత ప్లాస్టిక్‌ను అమ్మకుండా, వినియోగండా ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, కమర్షియల్, ప్రజారోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్పులబాధతో విఆర్‌ఒ ఆత్మహత్య



రమేష్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-రొద్దం

అప్పులబాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకన్న సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండలం మోపార్లపల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల తెలిపిన వివరాల మేరకు... మొపర్లపల్లి గ్రామానికి చెందిన రమేష్(35) రొద్దం మండలం కంబాలపల్లి సచివాలయంలో విఆర్‌ఒగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన గ్రామం బయట ఉన్న పొలంలో నివాసం ఏర్పాటు చేసకుని అక్కడే కుటంబ సభ్యులతో కలిసి ఉండేవాడు. కుటుంబ అవసరాల నిమిత్తం ఈయన రూ.5లక్షల వరకు ఇతరుల వద్ద అప్పులు చేశాడు. అప్పులు తీర్చడం కష్టం కావడంతో జీవితంపై విరక్తి చెందిన సోమవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తరువాత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విఆర్‌ఒ ఆత్మహత్య విషయం తెలుసుకున్న తహాశీల్దార్ అనంతచారి, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్‌లు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన సంస్కారాలకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. కంబాలపల్లి పంచాయతీ సర్పంచి మంజు రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు.

ఈద్గా శుభ్రత పనులను వేగవంతం చేయండి : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



ఈద్గాలో రంజాన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ వసీం

రంజాన్ పండుగ సమీపిస్తున్న తరుణంలో నగరంలోని ఈద్గా మైదానంలో శుభ్రత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ మొహమ్మద్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని హౌసింగ్ బోర్డు ఈద్గా మైదానంలో జరుగుతున్న పనులను అధికారులు, మైనార్టీ నేతలతో కలిసి మేయర్ పరిశీలించారు. ఇందులో భాగంగా పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పండుగను దృష్టిలో ఉంచుకుని ఈద్గా మైదానంలో ముళ్లపొదలు, చెత్తా చెదారం తొలగింపు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎకెఎస్ ఫయాజ్, కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, బాబా ఫక్రుద్దీన్, అబూ సాలేహా, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్‌ఒ గంగాధర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపై ఏం జరిగింది..?



- ఉమాపతిది ఆత్మహత్యా... హత్యా..?
- ప్రమాదమని కుటుంబ సభ్యుల ఫిర్యాదు
- పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు
- విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి...

అనంతపురం నగరంలోని విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ ఉమాపతిది ఆత్మహత్యనా...లేక హత్య అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. బుక్కరాయసముద్రం మండలం పరిధిలోని దేవరకొండపై కారు దూసుకెళ్లి కిందపడిన ఘటనలో ఉమాపతి మృతి చెందినట్టు వీడియో ఒకటి సోషియల్ మీడయాలో హల్‌చల్ చేస్తోంది. నగరంలోనే ఒక ప్రముఖ విద్యా సంస్థల్లో విద్యానికేతన్ ఒకటి. దీని కరస్పాండెంట్‌గానున్న వ్యక్తి చనిపోవడం నగరంలోనూ పెద్ద చర్చనీయాంశం అయ్యింది. ఇంత పేరున్న సంస్థ అధిపతి మృతి చెందడం అనుకోకుండా జరిగిందా.? లేక ఉద్దేశపూర్వకంగానే ఆయన ఆత్మహత్యకు యత్నించారా..? లేక ఎవరైనా ముందే హత్య చేసి దాన్ని ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందా..? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విద్యానికేతన్ ప్రయివేటు పాఠశాల కరస్పాండెంట్ ఉమాపతి కారులో నుంచి సోమవారం ఉదయం దేవరకొండపై నుంచి కిందపడి మృతి చెందారు. ఈ ఘటన జరిగి సమయంలో అక్కడే ఉన్న కారు కింద పడుతున్న దృశ్యాన్ని సెల్‌ఫోన్లో చిత్రీకరించారు. ఈ వీడియోలో చూసినప్పుడు ఆగిన కారు స్టార్టు అవకుండానే దూసుకెళ్లి కిందపడటం కనిపిస్తుంది. కిందపడే సమయంలో ఒక వ్యక్తి సార్...సార్ అంటూ వీడియో రికార్డు చేస్తూనే ఉన్నట్టు స్పష్టమవుతుంది. ఆ కారును ఆపే ప్రయత్నం చేసిన దాఖలాలు కూడా కనిపించకపోవడం గమనార్హం. కింద పడిన తరువాత ఉమాపతి కాలిన గాయాలతో చనిపోయినట్టు కనిపిస్తుండటం మరిన్ని సందేహాలకు తావిస్తోంది. ఎందుకంటే కారుపై నుంచి కిందపడినప్పుడు కారులో ఎటువంటి మంటలు వ్యాపించ లేదు. పైగా పై నుంచి కిందపడిన సమయంలో గాయాలయితే రక్తగాయాలు కావాల్సి ఉంది. ఆయన శరీరంపై పెద్దగా గాయాలు కనిపించక పోవడం చూస్తే ముందే చనిపోయి ఉంటాడా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అను మానాలు సాధారణ వ్యక్తులతో పాటు, ఆయన సన్నిహితుల్లో కలుగుతున్న అనుమానాలు. కాని కుటుంబ సభ్యులు మాత్రం ఆయన ప్రమాదవశాత్తు చనిపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు మాత్రం ఇది ఆత్మహత్య అయ్యి ఉండవచ్చునని భావిస్తున్నారు. ప్రాథమిక సాక్షాల ప్రకారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆయనే అంటించుకుని, శరీరంపై మంటలు వ్యాపించాక డ్రైవర్ పక్క సీట్లలో కూర్చొని హ్యాండ్ బ్రేక్ తీసివేయడంతో కారు కిందకు దూసుకుపోయిందని భావిస్తున్నారు. హత్య కుట్ర కనిపించడం లేదని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ వాదనలు ఇలాగుంటే ఆస్తి వ్యవహారాల్లో కొంత సమస్యలు కూడా ఉన్నట్టు సన్నిహితులు చెబుతున్నారు. విద్యా సంస్థల అధినేత అయిన ఉమాపతికి అప్పులతోపాటు నగరంలో పలుచోట్ల ఆస్తులున్నాయి ఈ ఆస్తులను కొన్నింటినీ ఇటీవల అమ్మే ప్రయత్నం చేసినట్టు కూడా తెలుస్తోంది. అయితే కొన్ని ఆస్తుల విషయంలో రాజకీయ నాయకుల నుంచి సమస్యలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ తగాదాలు కొంతకాలంగా కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో ఉమాపతి మృతి పెద్ద చర్చనీయాంశంగా మారుతోంది. పోలీసు అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తే తప్ప అసలు వాస్తవాలు వెలుగులోకి రావన్న వాదనలు వినిపిస్తున్నాయి. అన్ని కోణాల్లో దర్యాప్తు సాగిస్తేనే అసలు విషయాలు బయటకు వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విచారణకు రాజకీయపరమైన ఒత్తిళ్లు కొన్ని ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదంలో చనిపోయినట్టుగా చూపించాలని ఒత్తిడి పెంచుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు దీనిపై దర్యాప్తు ఏమి చేస్తారన్నది చూడాల్సి ఉంది.





కొండపై నుంచి పడి కారు(ఇన్‌సెట్‌లో మృతి చెందిన ఉమాపతి ఫైల్‌ఫొటో)

కాలేయాన్ని కాపాడుకోవాలి..

గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు మనోజ్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించి కాలేయాన్ని కాపాడుకోవాలని గ్యాస్ట్రో ఎంటరాల జిస్టు మనోజ్‌కుమార్ సూచించారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ సాధారణ ప్రజల్లో కూడా కాలేయ వ్యాధి గురించి అవగాహన పెంచాలనే ఉద్యేశంతోనే ప్రపంచ ఆరోగ్య సంరక్షణ సంస్థ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 19న కాలేయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానవ శరీరంలో రెండవ అతిపెద్ద, అత్యంత కీలకమైన అవయవం కాలేయం అన్నారు. కాలేయ శరీరంలో జీవక్రియ, జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి, టాక్సిన్స్ వడపోత, విటమిన్లు, ఖనిజాలు, గ్లూకోజ్ మొదలైన వాటి నిల్వకు మాత్రమే పరిమితం కాకుండా అనేక విధులు నిర్వహిస్తుందన్నారు. అలాంటి కాలేయ వ్యాధుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి సుమారు 20 లక్షల మంది చనిపోతున్నారన్నారు. ఇందులో భారతదేశం 10వ స్థానంలో ఉందన్నారు. మద్యపానం చేసేవారు ఎక్కువగా కాలేయ వ్యాధి బారిన పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా కాలేయ వ్యాధి నివారణకు సంబంధించి అవగాహన లేకపోవడం కారణంగా ఎక్కువ మంది ఈరోగాన బారిన పడుతున్నారన్నారు. కావున ఆరోగ్యకరమైన కాలేయం కోసం ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉండే ఆరోగ్యకరమైన, సమతుల్య ఆహారాన్ని తీసుకోఆవలన్నారు. అలాగే ఒత్తిడిని తగ్గించుకోవడానికి క్రమం తప్పకుండా వ్యాయామం, ధ్యానం చేయాలని, మద్యం, ధూమపానం మానుకోవాలని, సొంతగా మందులు తీసుకోకూడదని, సమయానికి టీకాలు వేయించుకోవాలని, కలుషితమైన సూదులు, అసురక్షిత సెక్స్‌ను పంచుకోవడం వంటి లక్షణాలను మానుకోవాలని సూచించారు.

నేడు ఇఫ్తార్ విందు

అనంతపురం కలెక్టరేట్ : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్యర్యంలో బుధవారం జిల్లాస్థాయి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షేక్ మహమ్మద్ రఫీ మంగళారం ఒక ప్రకటనలో తెలిపారు. టవర్‌క్లాక్ సమీపంలోని పోలీస్ కాంప్లెక్స్‌లో సాయంత్రం 6 గంటలకు విందు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్, అధికారులు, మైనారిటీ నాయకులు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

26న సిఎం పర్యటన.?

నార్పల : ముఖ్యమంత్రి జగన్ ఈనెల 26న నార్పల పర్యటనకు రానున్నారు. ఈనెల17న సిఎం పర్యటన ఉండగా అనివార్య కారణాల కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో తిగిరి ఈనెల 26న నార్పలకు రానున్నారు. ఈ సందర్భంగా వసతి దీవెన మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత

రూ.2500 కోట్ల లావాదేవీలే లక్ష్యం

ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత

ప్రజాశక్తి-అనంతపురం

2024 మార్చి నాటికి రూ.2500 కోట్లు లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత సూచించారు. మంగళవారం నగరంలోని జిల్లా సహకార కేంద్రం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం బ్యాంకు డిపాజిట్లు రూ.52 కోట్లు అన్నారు. ప్రస్తుతం బ్యాంకు వ్యాపారం రూ.1,721 కోట్లు ఉండగా మార్చి 2024 నాటికి రూ.2,500 కోట్ల లక్ష్యానికి చేరాలన్నారు. మార్చి 2023 నాటికి అడ్వాన్స్ మొత్తం రూ.1,105 కోట్లు ఉండగా మార్చి 2024 నాటికి రూ.1800 కోట్లు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం బ్యాంకు నికర లాభం రూ.1.4కోట్లు ఉండగా మార్చి 2024 నాటికి రూ.20 కోట్లు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే స్వయం సహాయక బృందాలకు జాయింట్ గ్రూపులకు గవర్నమెంట్ పథకాలకు విరివిగా రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు శంకర్‌రెడ్డి, రామాంజనేయులు, హైదర్‌వలీ, కారుణ్య జనార్ధన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బ్యాంకు సీఈవో విబి రాంప్రసాద్, జనరల్ మేనేజర్ సురేఖారాణి, ఒఎస్‌డి దినేష్‌కుమార్, చార్టర్ అకౌంటెంట్ రవిశంకర్‌రెడ్డి, డిజిఎం సుఖదేవబాబు, రవికుమార్, సీనియర్ అధికారులు, డైరెక్టర్లు రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్‌అదాలత్

రాయదుర్గం : వచ్చేనెల 13న రాయదుర్గంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్‌పర్సన్, జూనియర్ సివిల్ జడ్జి ఎన్.లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ అదాలతో రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులు, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు, పెండింగ్‌లో లేని కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. అలాగే రెవెన్యూ సంబంధిత సమస్యలు, ప్రభుత్వ పథకాలకు అర్హులై ఉండి అర్హత పొందలేని లబ్ధి పొందని వారు, బ్యాంకు, చిట్‌ఫండ్, మున్సిపాలిటీ ఏవైనా ఇతర సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కావున బాధితులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వారసత్వ సంపదను పరిరక్షిద్దాం

ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శశాంకమౌళి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పూర్వీకుల నుంచి మనకు సంక్రమించిన కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక కట్టడాలు, నిర్మాణాలను పదిలంగా కాపాడుకుందామని ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శశాకమౌళి, పురావస్తు శాఖ సంచాలకులు రజిత, ఇంటాక్ అనంతపురం చాప్టర్ కన్వీనర్ రామ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురష్కరించుకుని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, భారత జాతీయ కళలు వారసత్వ సంపదల సంస్థలు సంయుక్తంగా వారసత్వ సంపదపై చిత్ర ప్రదర్శన, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ప్రదర్శనను పురావస్తు శాఖ సహాయ సంచాలకులు రజిత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం సుసంపన్నమైన, బహువిధమైన వారసత్వ సంపద కలిగి ఉందన్నారు. భిన్నత్వంలో ఏకత్వమైన దేశంలో ప్రజాస్వామ్య, లౌకిక విధానాన్ని గౌరవించి ఆచరించే విధంగా ప్రాథమిక హక్కులు, బాధ్యతలు ప్రసాధించారని తెలిపారు. అందుకు అనుగుణంగా వాటిని కాపాడుకుంటూ మనమందరం నడచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ రమేష్ నారాయణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రియాజుద్దీన్, ఇంటాక్ జీవితకాల సభ్యులు నబిరసూల్, సూర్యనారాయణరెడ్డి, సాధు శేఖర్, బాలన్న, కళాశాల లెక్చరర్లు నాగభూషణం, పద్మావతి, అనంతరెడ్డి, నాగభూషణం విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ర్యాలీ

ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనల శాలల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది. క్లాక్‌టవర్ నుంచి పీస్ మెమోరియల్ హాల్ వరకు ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో పురావస్తు శాఖ సహాయ సంచాలకులు వి.రజిత, పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి తదితరులు హాజరయ్యారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇంటాక్ అనంతపురం చాప్టర్ కన్వీనర్ రామ్‌కుమార్

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అనంతపురం కేంద్ర సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్ అక్బర్ ఆధ్వర్యంలో అనంతపురం పట్టణ రూరల్ పరిధిలోని పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సప్తగిరి క్యాంఫర్, ఎంజీఎం స్ప్రింగ్స్, శ్రీ వెంకటేశ్వర డ్రిప్ ఇరిగేషన్ ఫ్యాక్టరీ, లోహిత బాలాజీ ట్రేడింగ్, డెక్కన్ పరిశ్రమల్లో అగ్నిమాపక పరికరాల ద్వారా రిహార్సల్స్ నిర్వహించి ప్రమాదాల పట్ల సిబ్బంది యాజమాన్య బాధ్యతలను తెలిపారు ప్రమాదం జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంకటరాముడు, విశ్వనాథ, చంద్రశేఖరప్ప, వంశీకృష్ణ, ఓబిరెడ్డి రమేష్ పరిశ్రమల సిబ్బంది యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కాగితాల మీదే టిడిపి అభివృద్ధి

'కాలవ' సెల్ఫీ వీడియోకు విప్ 'కాపు' సమాధానం

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి హయాంలో కేవలం కాగితాల మీద తప్ప ఆచరణలో అభివృద్ధి శూన్యమని విప్ కాపు రామచంద్రారెడ్డి విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధిపై మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు సోమవారం సెల్ఫీ వీడియో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా మంగళవారం పట్టణంలోని రోడ్డు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామచంద్రారెడ్డి సెల్ఫీ వీడియోపై వివరణ ఇచ్చారు. గుమ్మఘట్ట మండలం గోనబావి వద్ద ప్రభుత్వ బీసీ బాలికల ఆశ్రమ పాఠశాలకు టిడిపి హయాంలో మంజూరు చేసిన రూ.24 కోట్లు కేవలం కాగితాలకే పరిమితమైందని గుర్తు చేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు ఒక్క రూపాయి చెల్లించిన పాపానపోలేదన్నారు. అయితే కేవలం మాత్రం కాంట్రాక్టర్ వద్ద 10శాతం కమీషన్ పొందారని ఆరోపించారు. కాంట్రాక్టర్ మాత్రం డబ్బులు రాక బిల్లు పెట్టారన్నారు. ఇవన్నీ చేసి వైసిపి అసమర్థత వల్ల పని పూర్తి చేయలేదని ఆరోపణ చేయడం సత్యదూరమన్నారు. అంతేకాక బిటిపి ఎత్తిపోతల పథకానికి రూ.953 కోట్లు, రక్షిత తాగునీటి పథకానికి రూ.194 కోట్ల భూమిపూజ మాత్రమే చేశారన్నారు. రాయదుర్గంలో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎవరిని మభ్యపెట్టడానికి, మోసపుచ్చడానికి భూమిపూజ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకపై కాలవ శ్రీనివాసులు వదిలిపెట్టేది లేదని, అడుగడుగునా అతని మోసాన్ని బయటపెడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు భోజరాజునాయక్, రాయదుర్గం పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

పాలిటెక్నిక్ విద్యార్థులదే భవిష్యత్తు : ట్రాన్స్‌కో ఇఇ

ప్రజాశక్తి-ఉరవకొండ

పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ట్రాన్స్‌కో ఇఇ ఎ.గిరిధర్ అన్నారు. ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవ సంబరాలను మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ అష్రాఫ్ అలీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అనువైన అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. వీటన్నింటినీ విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. ట్రాన్స్‌కో డిఇఇ జిలాన్‌బాషా, ప్రిన్సిపాల్ అష్రఫ్‌ఆలీ, ట్రిబుల్ ఇ శాఖాధిపతి సురేష్‌బాబు మాట్లాడుతూ ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పడినపుటి నుంచి అనేక విజయాలను సాధించిందన్నారు. ఎంతోమంది విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత లక్షలను చేరుకున్నారన్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు కూడా వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సులోచన, ఆలీహాసన్ హుస్సేన్, కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నాగరాణి, జెడి పద్మారావు, తదితరులు పాల్గొన్నారు.


అతిథులను సన్మానిస్తున్న దృశ్యం

ఐఎన్‌టిఎస్ఒ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి అనంతపురం

ఐఎన్‌టిఎస్‌ఒ ఒలింపియాడ్ రెండవ లెవెల్‌లో గెలుపొందిన శ్రీచైతన్య అనంతపురం జోన్ విద్యార్థులకు ఎస్పీ కె.శ్రీనివాసరావు అందజేశారు. మంగళవారం స్థానిక శ్రీచైతన్య విద్యాసంస్థల్లో ఏజిఎం సుబ్బారెడ్డి సమక్షంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ అత్యంత అనుభవం కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో అద్భుతమైన పాఠ్య ప్రణాళికతో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అందువల్లే ఘనవిజయం సాధ్యమైందన్నారు. అనంతపురం విజేతలైన అనంతపురం 1 బ్రాంచ్ 5వ తరగతికి చెందిన హేమంత్, వెంకటసాయి, అనంతపురం 5వ బ్రాంచ్ 8వ తరగతికి చెందిన ప్రణీత్, అనంతపురం 6వ బ్రాంచ్‌కి చెందిన సాయిచరణ్, వర్షిత్, సిబిఎస్ఇ బ్రాంచ్‌కి చెందిన 8వ తరగతి విద్యార్థి లక్షిత్‌కు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ విశ్వనాథ్, తభసుం, కలందర్, షమీనా ఖాన్, పర్వీన్‌భాను, వెంకటేష్, నేత్రావతి, శాంత, శ్రీదేవి, స్వరూప, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాస్, డీన్లు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని 6వ రోడ్డులో కార్పొరేటర్ రహంతుల్లా ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు, రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సేవాతత్వానికి ప్రతీక అయిన రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం సలీమ్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఫయాజ్, జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షుడు రిజ్వాన్, బీసీ జోనల్ అధ్యక్షుడు రమేష్ గౌడ్, వైసిపి నాయకులు తబ్రేజ్, హిద్దు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


రంజాన్‌తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


తాడిపత్రిలో రంజాన్‌తోఫా పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడిపత్రి : ముస్లిం మైనారిటీ నాయకుడు కలైగర్ మహమ్మద్ ఆయూబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని నిరుపేద కుటుంబాలకు మంగళవారం నగదు, రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఆల్లా రఖా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఎర్రగుడి ఇస్మాయిల్, మహబూబ్ బాషాకు ఒక్కొక్కరికి రూ.5వేల నగదు, రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఎఆర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కెఎండి ఆయూబ్‌బాషా, ఎర్రగుడి ఇస్మాయిల్ మాట్లాడుతూ కుటుంబ సభ్యుల సహకారంతో తమ కుటుంబ సంపాదించిన కొంత సొమ్మును పేదలకు పంచాలనే ఉద్దేశంతో ఎఆర్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సొసైటీ రాజకీయాలు, కులమతాలకు అతీతంగా సేవలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నజీర్‌బాషా, ఎంఎస్.బాషా, ఖాజా, షాకీర్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల వాణిజ్య శాఖకు కంప్యూటర్ వితరణ

అనంతపురం : నగరంలోని కింగ్డమ్ కంప్యూటర్ అధినేత రాజశేఖర్ ఆర్ట్స్ కళాశాలలోని వాణిజ్య శాఖకు కంప్యూటర్‌ను వితరణగావించారు. మంగళవారం స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డికి కంప్యూటర్‌ను వితరణ చేశారు. సామాజిక బాధ్యతతో విద్యార్థులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో కంప్యూటర్‌ను అందించినట్లు రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాఖ అధిపతి శ్రీరాములు, అకడమిక్ సమన్వయకర్త పల్లవి, అధ్యాపకులు వెంకటస్వామి, మల్లికార్జున, షర్మిల, రామయ్య, చంద్రకళ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిఐ ఎం.వెంకటరామిరెడ్డి, ప్రత్యేక సబ్‌జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలంలో పర్యాటకుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ బ్యాంకు డైరెక్టర్ రామ్మోహన్, గుత్తి కోట సంరక్షణ సమితి నాయకులు చిరంజీవి, హెచ్ఎం.జిలాన్, దేవేంద్ర రాయల్, పురావస్తు సిబ్బంది కృష్ణ చైతన్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల కార్యాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండల కేంద్రంలో వికలాంగుల కార్యాలయం నిర్మించేందుకు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి మంగళవారం రూ.10వేలు ఆర్థికసాయం చేసినట్లు ఎఐటియు నియోజకవర్గ కార్యదర్శి చిన్నరాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు కార్యాలయం నిర్మించుకునేందుకు మంజూరు చేయాలని అధికారులను కోరామన్నారు. ఈ విషయంపై వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో ఎంపిపి కరణం పుష్పవతి భీమరెడ్డిని కలిసి సమస్యను విన్నవించడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి స్థలం పంపిణీ చేసే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అంతేగాకుండా వికలాంగుల కార్యాలయ భవనం నిర్మాణానికి రూ.10వేలు ఆర్థికసాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

తాడిపత్రి రూరల్ : రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న విద్యార్థికి తాడిపత్రి గవర్నమెంట్ పాలిటెక్నికల్ అధ్యాపకులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. తాడిపత్రి పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి భాను ప్రకాష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదానికి గురై కర్ణాటక రాష్ట్రంలోని హోసూరు పట్టణంలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అధ్యాపకులు విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి చికిత్స పొందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా విద్యార్థి వైద్య ఖర్చులకు కార్తికేయ శర్మ, చంద్రమోహన్ అధ్యాపకులు రూ.25వేల ఆర్థికసాయం అందించి విద్యార్థి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నాణ్యతలో రాజీపడొద్దు..

సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణనాయక్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట గ్రామ పంచాయితీలో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్ల నాణ్యతలో ఏమాత్రం రాజీపడకూడదని సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణనాయక్ సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. మంగళవారం పంచాయతీలో వేస్తున్న సీసీ రోడ్డును సర్పంచి భర్త పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలోని ప్రతి వీధిలో సిసి రోడ్డు వేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి నిర్మాణంలో ఏ మాత్రం నాణ్యత లోపించకుండా చూసుకోవాలని సూచించారు.


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచి భర్త ఆదినారాయణనాయక్

విద్యార్థులకు గ్లాసులు పంపిణీ

ఉరవకొండ : విడపనకల్లు మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విజయ్‌మోహన్ ఆధ్వర్యంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గిరిబాబు విద్యార్థులకు స్టీల్‌గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది విద్యార్థులకు రక్తహీనతతో పాటు బలహీనంగా ఉన్న విషయాన్ని గుర్తించిన సిఎం జగన్ విద్యార్థులకు రాగిజావా పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్‌కెయు కళాశాల ఆఫ్ ఫార్మాసిటికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం అధికారిణి పి.సత్యసౌమ్య ఆధ్వర్యంలో మంగళవారం ఆకుతోటపల్లి మేజర్ పంచాయతీలో స్పెషల్ క్యాంపు నిర్వహించారు. మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సర్వే ఆన్ కమ్యూనికబుల్ అండ్ నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక సమస్యలు, ఇతర వ్యాధులపై సర్వే చేశారు. ఈ సర్వే ఆధారంగా అక్కడి ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాలను వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెయు కళాశాల ఫార్మాసిటికల్ సైన్స్ ప్రిన్సిపల్ జి.సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ఎన్ఎస్ఎస్ విద్యార్థుల కృషి

ఉరవకొండ : గ్రామాల అభివృద్ధికి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమని ఉరవకొండ మహాత్మా ప్రయివేట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బసవరాజు అన్నారు. మహాత్మా ప్రయివేట్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్-ఎస్ విద్యార్థులు మండలంలోని బూదగవి గ్రామాన్ని దత్తతకు తీసుకుని వివిధ అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం గ్రామాలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛభారత్, కోవిడ్ జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం, చెట్లు నాటే కార్యక్రమాలతోపాటు స్వచ్ఛభారత్ తదితర అనేక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బసవరాజు, ఎఒ కెకె ప్రసాద్, కరస్పాండెంట్ షాజాహాన్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఇషాక్ అహ్మద్, సత్యనారాయణ, కళాశాల సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఎపిఎంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

వైఎస్ఆర్ క్రాంతి పథకంలో విధులు నిర్వహిస్తున్న మహిళా యానిమేటర్లను లైంగికంగా వేధిస్తున్న విడపనకల్ ఎపిఎంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు చిన్నరాయుడు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో మహిళా యానిమేటర్లు నియమించిందన్నారు. అలాంటి మహిళా యానిమేటర్లతో ఎపిఎం ఆంజనేయులు అసభ్యకరంగా వ్యవహరిస్తూ మానసిక క్షోభకు గురి చేయడం సమంజసం కాదన్నారు. వెంటనే ఎపిఎంపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ప్రయివేటు పాఠశాలల అక్రమ అడ్మిషన్లను ఆపాలి

రాయదుర్గం : విద్యాహక్కు చట్టాన్ని కాలరాస్తూ పట్టణంలో అక్రమ అడ్మిషన్లకు పాల్పడున్న ప్రయివేటు విద్యాసంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాయదుర్గం తాలూకా అధ్యక్షుడు అంజి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ సురేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రస్తుత విద్యా సంవత్సరం పూర్తి కాకముందే ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు నారాయణ, ఎవిఆర్, సెయింట్ థామస్, సెయింట్ పాల్ మొదలైన విద్యాసంస్థలు అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘించిన ప్రయివేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ స్థానిక నాయకులు అభిషేక్, అవినాష్, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రస్తా కోసం ఘర్షణ.. మహిళకు గాయాలు


గాయపడిన రాజమ్మ

పుట్లూరు : ఇంటి ముందు రస్తా కోసం గొడవ పడి మహిళలకు గాయాలైన ఘటన మండల పరిధిలోని వెల్లుట్ల గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో ఆదెప్ప, సాయి తమ ఇంటి ముందు గుంతలు తీసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన రాజమ్మ అడ్డుకుంది. దీంతో ఆగ్రహించిన ఆదెప్ప, సాయి మహిళపై కట్టెలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రాజమ్మను వెంటనే ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

వ్యక్తి ఖాతా నుంచి నగదు మాయం

గుత్తి : పట్టణంలోని జండా వీధికి చెందిన ఓ యువకుడు బ్యాంకు ఖాతా నుంచి మంగళవారం నగదు మాయమైంది. మహ్మద్ సిరాజుద్దీన్ తన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.4,600 ఒక్కసారిగా మాయమైంది. తన మొబైల్‌కు అమౌంట్ డెబిట్ అయినట్లు మెసేజ్ రావడంతో వెంటనే బ్యాంకు అధికారులను సంప్రదించాడు. అయితే సైబర్ నేరగాళ్లు నగదును దోచేసినట్లు బ్యాంకర్లు వివరించినట్లు బాధితుడు వాపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించినట్లు సిరాజుద్దీన్ చెప్పాడు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ యోగానందరెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పుట్లూరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ యోగానందరెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సచివాలయ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి పథకాలు అందేలా చూడాలన్నారు. ముఖ్యంగా పింఛన్లు పంపిణీ 1వ తేదీ నుంచి 5వతేదీ వరకు సెలవులు ఉన్నా వెల్ఫేర్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండి పంపిణీ చేయాలని సూచించారు. అదేవిధంగా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ కేంద్రం ప్రారంభం

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీలో వైసిపి నాయకులు కురుబ రామశేఖర్ సౌజన్యంతో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ కేంద్రాన్ని జడ్పీటీసీ కురుబ రమణమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ వేసవికాలం కావడంతో పాటు నిత్యం పలు పనుల నిమిత్తం సమీపంలోని సచివాలయానికి ఎందరో వస్తూ, పోతూ ఉంటారన్నారు. అలాంటివారి కోసం రామశేఖర్ సొంత నిధులతో మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కౌన్సిలర్ రంగనాథరెడ్డి, గన్నెవారిపల్లి కాలనీకి చెందిన పలువురు వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్ణానందస్వామి ఆరాధనోత్సవం

కళ్యాణదుర్గం : పట్టణంలోని దొడగట్ట రోడ్డులో ఉన్న శ్రీ పూర్ణానందస్వామి ఆశ్రమంలో మంగళవారం స్వామివారి 3వ ఆరాధానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పంచామృతాభిషేకం, కలశపూజ, పుష్పార్చన, అన్నదానం చేపట్టారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

నూతన బస్సు సర్వీసు ఏర్పాటు

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం నుంచి కణేకల్ బస్టాండ్ వరకు ఏర్పాటు చేసిన నూతన బస్సు సర్వీసును మంగళవారం ప్రారంభించినట్లు డిపో మేనేజర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం డిపో నుంచి వెళ్లనున్న పల్లె వెలుగు సర్వీసును విద్యార్థులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఎస్సీ-98కు ఎంపికైన అభ్యర్థులకు సన్మానం

అనంతపురం : డీఎస్సీ-1998 టీచర్ పోస్టుకు ఎంపికైన అనంతపురం జెఎన్‌టియు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ 98లో జెఎన్‌టియులో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ టి.విజయకుమార్, లైబ్రరీలో పని చేస్తున్న లక్ష్మీకాంతరెడ్డి ఎంపికయ్యారు. దీంతో వారిని స్థానిక జెఎన్‌టియులో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి రంగజనార్ధన, రిజిస్ట్రార్ సి.శశిదర్, వర్సిటీ పిఆర్ఒ రామశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సతామి వేడుకలు

నార్పల : దివ్య ఖురాన్ ఆవిర్భావ రోజును పురస్కరించుకుని మండల కేంద్రంలోని జాబియా మసీదు, ఈద్గా మసీదు, మక్కా మసీదుల్లో మంగళవారం రాత్రి ఘనంగా సతామి వేడుకలను నిర్వహించారు ఈ సందర్భంగా ముస్లిం సోదరులు రాత్రి జాగారం చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగా ముస్లిములు వారి దుకాణాలు, వాహనాలను ప్రత్యేకంగా అలంకరించారు.

వాహనాలకు వేలంపాట

ఆత్మకూరు : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 2 ఆటోలు, 5 ద్విచక్ర వాహనాలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో బుధవారం వేలం వేయనున్నట్లు ఎస్ఐ రవిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునేవారు రూ.5వేలు ధరావతు రుసుమును చెల్లించి పాల్గొనాలని కోరారు.

పేదలకు దుస్తులు పంపిణీ

అనంతపురం : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ అక్బర్‌సాహెబ్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం మహిళలకు మంగళవారం చీరలు పంపిణీ చేశారు. తమవంతు బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు అక్బర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అక్బర్ ఐ ఆసుపత్రి సీఈవో నూర్ మహమ్మద్, అరీఫ్, నూర్, ఆస్పత్రి సిబ్బంది నిజాం, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ అక్బర్‌సాబ్